క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు, పూర్వ విద్యార్థులు

కరప: స్థానిక మెరకవీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు శుక్రవారం పంపిణీ చేశారు. కాకినాడ ఆనంద్‌భారతి మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అసోసియేషన్‌ను అడిగిన వెంటనే విద్యార్థులకు వీటిని సమకూర్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం కె.సీతామహాలక్ష్మి, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు ఈవీవీ సత్యనారాయణ, దారపు వేమనరెడ్డి, నేదునూరి ఉమామహేశ్వరరావు, పేకేటి దుర్గా ప్రసాద్, నక్కా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్



కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యారేజ్ ఆవరణలోని సైకిల్ స్టాండ్, గ్యారేజ్, బస్టాండ్‌లను ఉద్యోగులంతా కలిసి శుభ్రం చేశారు. ప్రతి నెలలో ఒకరోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంవీయూ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్‌లతో పాటు ఉద్యోగులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

జీవో 117 రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాకినాడ సిటీ: ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకులు కలెక్టర్ షాన్ మోహన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ నగేష్, టి.రవిచక్రవర్తి మాట్లాడుతూ, జీఓ 117 రద్దు చేసి, జీఓ 53 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్‌లో రెండు మీడియాలను సమాంతరంగా కొనసాగించాలని, పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, పని భారం తగ్గించాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యలు పరిష్కరించి, పోస్టుల అప్‌గ్రేడేషన్, ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించాలని, ప్లస్2 పాఠశాలల్లో పీజీటీ పోస్టులకు రెగ్యులర్ ప్రమోషన్లు ఇవ్వాలని, ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలనే 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

యూడీసీకి మద్దతుగా నిరసన



రాధాకృష్ణకు మద్దతుగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఇంద్రపాలెం ప్రజలు

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో యూడీసీ కాండ్రేగుల రాధాకృష్ణ అదృశ్యంపై ఇంద్రపాలెం గ్రామ ప్రజలు రాధాకృష్ణకు మద్దతుగా నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఈ నిరసన ఇంద్రపాలెం మెయిన్ రోడ్ ముసలమ్మ తల్లి గుడి వద్ద జరిగింది. అనంతరం ర్యాలీగా బయలుదేరి డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాధాకృష్ణ అదృశ్యానికి కారకులైన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణ కుటుంబ సభ్యులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. రాధాకృష్ణ కుటుంబానికి న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, మన ఊరు–మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, అఖిలపక్ష నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో వ్యవహరించి..

- యమపాశాల్లా విద్యుత్ తీగలు
- చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు



రాయుడుపాలెంలో ఓ ఇంటిని ఆనుకుని ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బాక్స్

కాకినాడ రూరల్: నిత్య జీవితంలో విద్యుత్ వినియోగం ఎంత అవసరమో.. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా అంతే ప్రమాదం. జనావాసాలతో పాటు అవసరాలూ పెరిగాయి. దానికి అనుగుణంగా విద్యుత్తు వ్యవస్థ లేక యమపాశాలై కాటేస్తున్నాయి. వానాకాలం వచ్చిందంటే చాలు ఇవి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో గృహ విద్యుత్ కనెక్షన్లు సుమారు 2.2 లక్షల వరకూ ఉన్నాయి. రూరల్‌లో రమణయ్యపేట, ఏపీఐఐసీ కాలనీ, వాకలపూడి, వలసపాకల, సర్పవరం, తమ్మవరం, పెనుమర్తి తదితర గ్రామాల్లో చాలాచోట్ల విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అవి చేతికందే ఎత్తులో ఉన్నాయి. కాకినాడ అర్బన్ సురేష్‌నగర్, శశికాంత్‌నగర్, బొందగుంత తదితర ప్రాంతాల్లో కేబుల్ తీగలు, విద్యుత్ తీగలతో కలసి ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు యమ పాశాలుగా మారుతున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతానికి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

వానాకాలం.. అప్రమత్తం

ప్రస్తుతం వానలు దంచి కొడుతున్నాయి. మరో ఆరు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే వాతావరణం మారి చినుకులు పడుతున్నాయి. ఈ వానలతో కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు పూర్తిగా తడుస్తున్నాయి. విద్యుత్ తీగలతో పలు కేబుల్ వైర్లు ప్రమాదభరితంగా మారాయి. తడిచిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ ప్రసరించే ప్రమాదం ఉంది. నేలంతా తడిచి ఉండడంతో వానలు పడే సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగల వద్దకు జనాలు వెళ్లరాదు. ఒకవేళ స్తంభాలను తాకితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. పొలాల్లో పనిచేసే వ్యవసాయ, కూలీలు మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికైనా స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను, చెట్ల కొమ్మల నుంచి వెళ్లిన తీగలను సరిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేలాడుతున్న తీగలను సరిచేయాలి



విద్యుత్ స్తంభాల మధ్య తీగలు చాలాచోట్ల కిందకు వేలాడుతున్నాయి. కొన్నిచోట్ల ఇళ్లను ఆనుకుని తీగలు ఉండడంతో ప్రమాదకరంగా మారింది. వానాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు చూడడంతో పాటు ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలి.

– బందిలి వీరీష, ఎంపీపీ, కాకినాడ రూరల్

అప్రమత్తంగా ఉన్నాం

వర్షాలు పడుతుండడంతో విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉంది. డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటారు. ప్రజలు తడిచిన విద్యుత్ స్తంభాలను తాకరాదు. ప్రమాదభరిత ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు, విద్యుత్ తీగలపై నుంచి వెళుతున్న చెట్ల వద్దకు వెళ్లరాదు. ఏదైనా సమస్య ఉంటే తక్షణం కాకినాడ డివిజన్‌లో కంట్రోల్ రూమ్ నంబరు 94408 12586కు ఫిర్యాదు చేయవచ్చు.

– వి.ప్రసాద్, విద్యుత్ శాఖ డీఈ, కాకినాడ

పారిశుధ్య పనుల్లో ఇబ్బంది రానీయొద్దు



కరపలో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని, రక్షిత మంచినీరు సరఫరా సక్రమంగా అందించాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. వచ్చే నెల ఒకటిన పింఛన్ల పంపిణీ నూరు శాతం పూర్తయ్యేలా తగిన శ్రద్ధ వహించాలన్నారు. వచ్చే నెల 8న కాకినాడ రూరల్ పరిషత్ కార్యాలయంలో జరిగే దివ్యాంగుల శిబిరం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ల నుంచి బురదనీరు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని, క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటిని అందించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 22 పనులకు రూ.1.40 కోట్లు మంజూరయ్యాయని, వీటికి అంచనాలు రూపొందించాలన్నారు. ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీ రాజ్ ఏఈఈలు వీవీఎస్ వర్ధన్, ఎస్.రాంబాబు, శైలజ, ఏపీఓ జీవీ రమణకుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బోట్‌క్లబ్: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బీజేపీ సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ అన్నారు. స్థానిక 29వ డివిజన్‌లోని సూర్యనారాయణపురం, సాడివారి వీధి, బ్రాహ్మణ వీధి, కాశికాయల వారి వీధిలో స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా డ్రైనేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైళ్ల నుంచి జారిపడి ఇద్దరి మృతి

సామర్లకోట: వేర్వేరు రైళ్ల నుంచి జారిపడి ఇద్దరు మృతి చెందినట్లు స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పిఠాపురం నుంచి సామర్లకోట వస్తున్న గుర్తు తెలియని రైలు నుంచి ఓ వ్యక్తి(40) కేఎం నంబరు 630 వద్ద, సామర్లకోట నుంచి పిఠాపురం వైపు వెళ్తున్న రైలు నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి జారిపడి మృతి చెందారన్నారు. రైల్వే కీమెన్ పి.శివకృష్ణ సమాచారం మేరకు పోలీసులకు సమాచారం తెలిపామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై లోవరాజు తెలిపారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువఝ్జల అవధాని, ముష్టి పురుషోత్తం, అర్చకులు కోట వంశీ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధులు ముమ్మరం

- పరిసరాల శుభ్రత తప్పనిసరి
- స్వచ్ఛతా వారోత్సవాల్లో అవగాహన



స్వచ్ఛతా వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ భావన

కాకినాడ సిటీ: వర్షాకాలం అంటే వ్యాధుల సీజన్ వచ్చినట్టే. పరిసరాల శుభ్రత లోపించడమే దీనికి కారణం. కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో అడపాదడపా వానలు పడుతున్నాయి. ఇదిలా ఉంటే పట్టణంలో పాటు రూరల్‌లోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ఎక్కడికక్కడే మురుగునీరు, వర్షం నీరు తిష్టవేస్తోంది. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. మురుగునీటిలో వృద్ధి చెందే దోమల కారణంగా మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. కలుషిత నీరు, ఆహారంతో డయేరియా ప్రబలుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వచ్ఛతా వారోత్సవాల్లో అధికారులు సూచిస్తున్నారు.

- ప్రధానంగా డెంగీ జ్వరం ఆడ ఈడిస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. పగటి పూట ఇవి ఎక్కువగా కుడతాయి. ఈ దోమ మంచి నీటిలోనే గుడ్లు పెడుతుంది. ఈ దోమకాటుతో మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ రావచ్చు. ఆకస్మికంగా జ్వరంతో పాటు కీళ్లు, కండరాలు, కంటి నొప్పులు, వాంతుల వుతాయి. కొందరికి శరీరంపై ఎర్రని దద్దుర్లు, పళ్ల చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. దీనికి అత్యవసరమైన చికిత్సతో పాటు కొందరికి ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి వస్తుంది.
- మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్నజీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుంది. ఆ దోమలు మంచి, మురుగునీటి నిల్వల్లో పెరిగి మలేరియా వ్యాధిని కలుగజేస్తాయి. ఏడు నుంచి పది రోజుల్లోపు చలి, వణుకు, ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజు తప్పించి రోజు వస్తుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తగిన చికిత్స పొందాలి.
- కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అతిసారం, టైఫాయిడ్ వ్యాధులు సంక్రమిస్తాయి. రోజుకు మూడు అంతకంటే ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే దానిని అతిసారంగా భావించాలి. ఇది బ్యాక్టీరియా, లేక వైరస్ వల్ల కానీ రావొచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ముఖ్యంగా పారిశుధ్య లోపం వల్ల అతిసారం వస్తుంది. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, అధిక దాహం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు.
- చికున్ గున్యా వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన ఈడిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం దీని ముఖ్య లక్షణం. ఇది శరీరంలో అన్ని కీళ్లను బాధిస్తుంది. ఈ లక్షణాలు కనబడిన వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అధికారులు స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు



గ్రామాల్లోని మురికివాడలు, డ్రైనేజీల్లో వర్షపు, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం. వీధులు, రోడ్ల వెంబడి చెత్తాచెదారం పేరుకుపోకుండా రోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల సమన్వయంతో స్వచ్ఛతా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. రక్షితనీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నాం. వైద్యుల సహకారంతో ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నాం.

– రమేష్ నాయుడు ఎంపీడీఓ, కాకినాడ

అవగాహనతో అధిగమించాలి



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వైరస్‌లు, బ్యాక్టీరియా వల్ల జ్వరాలు ప్రబలుతాయి. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి. వేడి పదార్థాలు తీసుకోవాలి. వంట పాత్రలపై మూతలు పెట్టుకోవాలి. ఆరోగ్య సమస్య వస్తే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ హెచ్ నరసింహనాయక్, డీఎంహెచ్ఓ, కాకినాడ

అమరవీరులను స్మరించుకుందాం..



రమణయ్యపేటలో మాజీ సైనికులను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరులను అంతా స్మరించుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రామారావుపేట వైఎస్సార్ షటిల్ స్టేడియంలో శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభను నిర్వహించారు. క్రీడాకారులకు జాతీయ పతాకాలను అందజేశారు. అడ్డాల మాట్లాడుతూ 1999 కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల శౌర్యాన్ని, త్యాగాన్ని గౌరవిస్తూ కార్గిల్ విజయ్ దివస్ పాటిస్తున్నామన్నారు. కార్గిల్ యుద్ధం భారతదేశం నలుమూలల నుంచి ప్రజలను ఒకచోట చేర్చిందన్నారు. సాయుధ సైనికులకు వారి మద్దతు, పౌరుల్లో జాతీయ భావాన్ని పెంపొందించిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, చైతన్య, కిరణ్, సిరాజ్, వీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మాజీ సైనికులు ఎస్.శ్రీనగేష్, ఎస్.రామారావు, సీఆర్ఎస్ ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు అడబాల రత్నప్రసాద్, కార్జాసుల సత్యనారాయణ, కృష్ణమోహన్, గల్లా సుబ్బారావు, ఇందుగల ప్రసాద్ నాయుడు, రాజా, వెంకటేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే..



వేములవాడలో ముసాలమ్మకు గోరింటాకు పెడుతున్న మహిళలు

కాకినాడ రూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. ఇంద్రపాలెంలో ముసలమ్మ అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లలితా సహస్ర నామాలు, అష్టోత్తరాలు చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద కనకదుర్గమ్మను ఆలయ అర్చకుడు వెంకటరమణ ఆధ్వర్యంలో శాకంబరిగా ముస్తాబు చేశారు. ఆధ్యాత్మికవేత్త గల్లా సుబ్బారావు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, కృష్ణమోహన్ తదితరులు పూజలు చేశారు.

ముసాలమ్మ తల్లికి గోరింటాకు

కరప: వేములవాడ గ్రామ దేవత ముసాలమ్మ తల్లికి శుక్రవారం ఆలయ ధర్మకర్త పుణ్యమంతుల అప్పారావు, సూర్యవతి దంపతుల ఆధ్వర్యంలో గ్రామ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి గోరింటాకు పెట్టారు. హిందూ సంప్రదాయాన్ని అనుసరించి గోరింటాకును నూరి, ఊరేగింపుగా గ్రామ దేవత ఆలయానికి తీసుకెళ్లారు. మహిళలు అమ్మవారికి గోరింటాకు పెట్టి, తర్వాత వారంతా ఆలయ ప్రాంగణంలో కూర్చుని గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి గోరింటాకు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.



శాకంబరిగా ఇంద్రపాలెం గ్రామ దేవత ముసలమ్మ

మా పూజలు అందుకో మరిడమ్మా..



మరిడమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోటలోని నూకాలమ్మ అమ్మవార్లు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణ అధికారులు రామ్మోహన రావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆషాఢ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని వివిధ రకాల పుష్పాలతో అమ్మవార్లను అలంకరించారు. మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ పర్యవేక్షించారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

పిఠాపురం: గొల్లప్రోలు కరణంగారి తోట ఏరియాలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయ పండితులు పలు రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాలికల చట్టాలపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: ప్రతిఒక్కరూ మహిళలు, బాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ-2 వరలక్ష్మి సూచించారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వరలక్ష్మి మాట్లాడుతూ బాలికల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు, మహిళల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది లోవలక్ష్మి, అమలావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో నువ్వు పంటకు నష్టం



ఎస్‌బీ పేటలో అధిక వర్షాలకు దెబ్బతిన్న నువ్వు పంట

తుని రూరల్: అల్పపీడనం ప్రభావంతో మండలవ్యాప్తంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఆరుతడిగా సాగయ్యే నువ్వు పైర్లు దెబ్బ తిన్నాయి. మండలంలోని సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, ఎస్.సూచవరం, కుమ్మరిలోవ, డి.పోలవరం తదితర గ్రామాల్లో రైతులు ఆరుతడిగా నువ్వు పంటను సాగు చేశారు. పిందెలు, కాయలతో పైర్లు ఉండగా ఇటీవల ఐదారు రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు నేల ఊటబారి ఆరుతడి పంటలు దెబ్బతిన్నాయని సుభద్రయ్యమ్మపేట గ్రామానికి చెందిన రైతులు తెలిపారు. బూడిత తెగులు సోకి పంట నష్టం వాటిల్లిందన్నారు. అధిక వర్షాలకు మండలంలో 30 నుంచి 35 ఎకరాల్లో నువ్వు పంట దెబ్బతింది. దుక్కులు, విత్తనాలకు పెట్టిన పెట్టుబడులు నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.